సులభంగా.. వేగంగా!

- అందుబాటులోకి పోస్టల్ సేవలు
- కోరితే ఇంటివద్దకే సిబ్బంది
- పోస్ట్ ఇన్ఫోయాప్‌తో వెసులుబాటు


జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీసు

ఆదిలాబాద్: మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా పోస్టల్ శాఖ డిజిటలైజేషన్ వైపు అడుగులు వేస్తోంది. వినియోగదారులు, ఖాతాదారులకు పోస్టల్ ద్వారా అందిస్తున్న సేవలను మరింత సులభతరం చేసే దిశగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఆ శాఖ ద్వారా అందిస్తున్న సేవల సమాచారాన్ని పొందుపర్చి ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పోస్ట్ ఇన్ఫో పేరుతో ప్రారంభించిన ఈ యాప్‌ను ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా సమీపంలోని పోస్టాఫీస్ చిరునామా, వివరాలతోపాటు మరింత సమాచారాన్ని తెలుసుకునే విధంగా రూపొందించారు. అదేవిధంగా వివిధ పోస్టల్ పథకాల్లో చేరేలా పోస్ట్ ఇన్ఫోయాప్ ఉపయోగపడేలా తయారు చేశారు.

అందుబాటులో పథకాల వివరాలు..

పోస్టల్ ద్వారా అందిస్తున్న సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్, టైం డిపాజిట్లు, సేవింగ్ అకౌంట్లు, మహిళా సమ్మాన్ సేవింగ్స్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, మంత్లీ ఇన్కమ్ స్కీం, ఎన్ఎస్‌సీ, కేవీపీ వంటి పథకాల వివరాలు వాటికి అందించే వడ్డీ రేట్ల వివరాలను యాప్‌లో పొందుపర్చారు. నేషనల్ పెన్షన్ పథకం సమాచారం కూడా ఉంది. పలు పథకాల్లో డిపాజిట్ చేసే నగదు, అందుకు అందించే వడ్డీని లెక్కించి వినియోగదారులు తమ కు అనువైన పథకాన్ని ఎంచుకునేలా వెసులుబాటు కల్పించారు. అదేవిధంగా పోస్టల్ అందిస్తున్న జీవిత బీమా పథకాలకు సంబంధించిన మరింత సమాచారాన్ని కూడా తెలుసుకోవచ్చు. ఇన్సూరెన్స్ పథకాల సమాచారాన్ని తెలుసుకోవడమే కాకుండా పాలసీ కోసం దరఖాస్తు చేసుకునేలా డిజైన్ చేశారు. అలాగే ఎంత ప్రీమియం చెల్లించాలో అనే క్యాలిక్యులేటర్ ఆప్షన్ ద్వారా లెక్కించుకోవచ్చు. ఇందులో ఏజెంట్లతోపాటు వినియోగదారులు లాగిన్ అవ్వొచ్చు.

ఇంటి వద్దకే సేవలు..

వినియోగదారులు, ఖాతాదారులకు మరింతగా దగ్గర అయ్యేందుకు ఈ యాప్‌లో సర్వీస్ రిక్వెస్ట్ అనే మరో ఆప్షన్ తీసుకొచ్చారు. ఈ ఆప్షన్‌క్లిక్ చేయగానే మనకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని పొందుపరిచి మనం ఏ సేవలు పొందాలనుకుంటున్నామో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. కార్యాలయం వరకు రాకుండానే పోస్టల్ సిబ్బంది ఇంటికి వచ్చి ఇంటి వద్ద నుంచి పోస్టల్ సేవలు అందించనున్నారు. మెయిల్ బుకింగ్, మెయిల్ డెలివరీ, ఆర్థిక సేవలు, ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా అందించే జీవన్ ప్రమాణ్, ఆధార్, ఇతర సేవలను పొందేందుకు ముందస్తుగా విజ్ఞప్తి చేయవచ్చు. ఇందుకు కొంతమేర చార్జ్ చేస్తారు.

చార్జీలు.. ఆర్టికల్ ట్రాకింగ్

పోస్టల్ ద్వారా ఏవైనా పోస్టులు, వస్తువులు పంపించాలనుకునే వినియోగదారులకు వారి వస్తువుకు సంబంధించిన బరువు వివరాలను తెలియపరిస్తే అందుకు సంబంధించి ఎంత చార్జీ చెల్లించాలో ఇందులో తెలుస్తుంది. రిజిస్టర్ పోస్ట్, స్పీడ్ పోస్ట్ చార్జీల వివరాలు, అదేవిధంగా ట్రాకింగ్ చేసి, చేరాల్సిన చిరునామాకు చేరాయా లేదా అనే సమాచారాన్ని ఎప్పటికప్పుడు పొందవచ్చు.

ఇతర సేవలు..

ఈ యాప్‌లో స్థానికంగా దగ్గరగా ఉన్న పోస్టాఫీస్ వివరాలు ఉంటాయి. మొబైల్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఐపీపీబీ ఖాతా తెరిచి డబ్బులు సైతం డిపాజిట్ చేయవచ్చు. శాఖ ద్వారా అందిస్తున్న సేవలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే చేయవచ్చు.

అవగాహన కల్పించాలి

పోస్ట్ ఇన్ఫోయాప్‌లో ఎన్నో సేవలు అందుబాటులో ఉన్నాయి. పోస్ట్ ఆఫీస్‌కు వెళ్లి సేవలు సద్వినియోగం చేసుకోలేని దివ్యాంగులు, వృద్ధులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. నామమాత్రపు చార్జీలతో ఇంటి వద్దకే వచ్చి బీమా పథకాలను సైతం అందిస్తుండడం శుభపరిణామం. ఈ యాప్ పనిచేసే విధానాన్ని పోస్టల్ శాఖ అధికారులు అవగాహన కల్పించాలి.

– నవేద్ అలీ, ఆదిలాబాద్

క్లుప్తంగా

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు


అశోక్‌నగర్‌లో మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఇచ్చోడ: 'ఖాళీ బిందెలతో నిరసన' అనే శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మేజర్ పంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో లక్ష్మణ్ మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. గురువారం నుంచి అశోక్‌నగర్ కాలనీవాసులకు నల్లాల ద్వార నీటిని విడుదల చేస్తామన్నారు.

కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీకి మన్నూర్ విద్యార్థిని ఎంపిక


పెందూర్ లక్ష్మి

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పెందూర్ లక్ష్మి పదో తరగతి పరీక్షల్లో ఉన్నత ప్రతిభ కనబర్చి తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం సంతోష్ కుమార్ బుధవారం తెలిపారు. రాష్ట్రంలోని వనపర్తిలో ఉన్న ఈ ఏకైక కళాశాలలో సీటు పొందడానికి తీవ్ర పోటీ ఉంటుందని తమ విద్యార్థినికి సీటు రావడం అభినందనీయమన్నారు. బోధనా సిబ్బంది పెందూర్ లక్ష్మికి అభినందనలు తెలిపారు.

గోడలు శుభ్రం


శుభ్రపరిచిన ఐటీడీఏ కార్యాలయ గోడలు

సాక్షి ఎఫెక్ట్..

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ గోడలు శుభ్రపరిచారు. బుధవారం సాక్షిలో ప్రచురితమైన 'ఐటీడీఏలో అపరిశుభ్రత' కథనానికి స్పందించిన అధికారులు కార్యాలయ గోడలను, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌అర్బన్: ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో కార్మికుల శ్రమదోపిడి పెరిగిందని సీఐటీయూ నాయకులు కిరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికులు చాలీచాలని జీతాలతో సతమతమవుతుంటే పని గంటలు పెంచుతూ ఇబ్బందులపాలు చేస్తున్నారన్నారు. కార్మికులు ప్రశ్నిస్తే విధుల నుంచి తప్పిస్తున్నారని మండిపడ్డారు. డిపోలో 400 పైచిలుకు కార్మికులు పని చేస్తున్నా డిపోలో సౌకర్యాలు లేవని తెలిపారు.

'సిబిల్‌తో ముడి పెట్టొద్దు'

నార్నూర్: రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు బ్యాంక్ సిబిల్‌తో సంబంధం లేకుండా ఉపాధి అవకాశాలు కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బిక్షపతి రాథోడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో గంగాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చాల్కుర్ ప్రకాశ్ ఉన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని తంతోలి గ్రామానికి చెందిన ఇద్దరు వీడీసీ సభ్యులతో పాటు మద్యం విక్రయించిన మరో వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.15,370ల విలువ చేసే అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

మొరాయిస్తున్న సర్వర్

జైనథ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కొత్త రేషన్ కార్డుల నమోదు ప్రక్రియలో భాగంగా ఇంటింటికీ తిరుగుతున్న అధికారులకు రేషన్‌కార్డు సైట్ ఓపెన్ కాకపోవడం సమస్యగా మారింది. కొత్త రేషన్‌కార్డులో దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేసేందుకు ఒక కుటుంబానికి అరగంట సమయం పడుతుంది. మండలంలో మీసేవ ఆన్‌లైన్‌లతో పాటు ప్రజాపాలనలో కొత్త రేషన్‌కార్డులు, పేర్ల నమోదు దరఖాస్తులు మొత్తం 1535 వచ్చాయి. ఇందులో 661 నమోదు చేయగా మిగతా 874 దరఖాస్తులను పరిశీలించాల్సి ఉందని తహసీల్దార్ ఆత్రం నారాయణ తెలిపారు.

జగదాంబ దేవి ఆలయంలో పూజలు


ఈద్గా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం గ్రామంలో గల శ్రీ జగదాంబ దేవి ఆలయాన్ని బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, రాథోడ్ సురేందర్, నాని (నక్లు), పాండు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం

గుడిహత్నూర్: రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి, సమన్యాయం కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యపడుతుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని డొంగర్‌గావ్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఈద్గాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. నేడు రాష్ట్రంలోని అన్ని వర్గాలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. అంతకు ముందు ముస్లింలు ఎమ్మెల్యేను సత్కరించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్, నాయకులు బొజ్జ నారాయణ, జమీర్, సలీంఖాన్, జాదవ్ రమేశ్, సంతోష్ గౌడ్, గఫార్, రషీద్‌ఖాన్, అర్షద్, ఇమ్రాన్ ఖాన్, గౌస్ తదితరులు ఉన్నారు.

కుల సంఘాల కృషి అభినందనీయం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, ఎంపీ నగేశ్

కైలాస్‌నగర్: సమాజంలోని పేదలను ఉన్నతస్థితికి తీసుకొచ్చేందుకు కుల సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డ్ కాలనీలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రెడ్డి సంఘ వసతిగృహ భవనాన్ని ఎంపీ గోడం నగేశ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేసి బుధవారం ఆయన ప్రారంభించారు. తొలుత కొత్వాల్ రాజబహదూర్ వెంకట్రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జోగు రామన్న, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణరెడ్డి, రాంరెడ్డి, కార్యదర్శి కిష్టారెడ్డి, బాలూరి గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా, మౌనిష్ రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జ్యోతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని బట్టి సావర్‌గాం గ్రామ పంచాయతీ పరిధిలో గల దుబ్బగూడలో పాఠశాల, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాల కోసం ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు బుధవారం భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



విద్యార్థులతో హెచ్‌ఎం శైలజ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన ఆరా దీప, సిడాం ఆకాశవాణిలు బుధవారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు రొడ్డు శైలజ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన ఆరా దీప జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల విద్యార్థులలో జిల్లా స్థాయిలో మొదటి, రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు, సిడాం ఆకాశవాణి జిల్లా స్థాయిలో రెండో, రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు సాధించారన్నారు.

కేసుల దర్యాప్తు సమర్థవంతంగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ సబ్‌డివిజన్ పరిధిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక కార్యచరణ రూపొందించారు. మొదటి అడుగుగా ఉట్నూర్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న మూడు సర్కిల్ కార్యాలయాలు, 8 పోలీసుస్టేషన్‌ల పరిధిలో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ దాదాపు 200 కేసులను పరిష్కరించే దిశగా ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులలో ఎంవీఐ రిపోర్టులు, పీఎంవీ రిపోర్టులు, అగ్రికల్చర్ కార్యాలయం ఉన్న రిపోర్టులు, వెటర్నరీ కార్యాలయంలో ఉన్న రిపోర్టులను సాధ్యమైనంత త్వరగా తీసుకొని దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, సీఐ మొగిలి, రహీం పాషా, ఎస్సైలు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాంప్రసాద్

గుడిహత్నూర్: అనసవరమైన రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ బి. రాంప్రసాద్ అన్నారు. మండలంలోని మన్నూర్ గ్రామంలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మాట్లాడారు. రైతులు తక్కువ యూరియా వాడడం, అవసరం మేరకు రసాయన మందులు, సాగు నీటి వాడకం, పంట మార్పిడి ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. రైతులు సేంద్రియ ఎరువుల వాడకం పెంచుతూ.. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు, ఎరువులు, రసాయన మందులు కొన్నప్పుడు రశీదు తీసుకోవాలన్నారు. సోయా చిక్కుడు సాగులో యాజమాన్య పద్ధతులు వివరించారు. మండల వ్యవసాయ అధికారి బి. రమేశ్ మాట్లాడుతూ.. పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులు వాడకూడదన్నారు. మాజీ ఎంపీపీ జ్ఞానోబా, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కరాడ్ ప్రకాశ్, మాజీ ఉప సర్పంచ్ జగన్, ఏఈవో వంశీ రైతులు పాల్గొన్నారు.

నార్నూర్: గాదిగూడ మండలంలోని రైతువేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేతలు' కార్యక్రమంలో భాగంగా రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేతలు మాట్లాడుతూ రైతులు వ్యవసాయం చేసేటప్పుడు ఎరవులు వాడే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యూరియా, డీఏపీ మోతాదుకు మించి వాడితే భూసారం కోల్పోతుందన్నారు. డాక్టర్ రాజేశ్వరి, ప్రొఫెసర్ మౌనిక, ఎంవోఏ వెంకన్న, తహసీల్దార్ చౌహాన్ విలాస్, సీపీఎఫ్ ప్రోగ్రామ్ అధికారి దిలీప్ రాథోడ్, డాక్టర్ వంశీ కిరణ్, ఏఈవో యోగిరాజ్, సంధ్య, కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. చల్లబడ్డ వాతావరణం


తాంసి: జొన్నపంట తడిసిపోకుండా టార్పాలిన్ కవర్లు కప్పిన రైతులు


భీంపూర్: అకాల వర్షానికి విరిగిపడిన విద్యుత్ స్తంభం

తాంసి: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు గాలితో కూడిన వర్షం పడింది. తాంసితో పాటు మండలంలోని పొన్నారి, గిరిగాం, వడ్డాడి, హస్నాపూర్, గోట్కూరి, సావర్గాం, బండల్ నాగాపూర్, కప్పర్ల తదితర గ్రామాల్లో గంటకు పైగా భారీ వర్షం కురిసింది. తాంసి మార్కెట్‌లోని జొన్నలు వర్షానికి తడవకుండా రైతులు కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచారు.

తలమడుగులో..

తలమడుగు: మండలంలోని లింగి, తలమడుగు, కుచులాపూర్, కజ్జర్ల, దేవాపూర్, బరంపూర్, ఝరి, ఖోడద్ గ్రామాలలో బుధవారం మధ్యాహ్నం ఉరుముల మెరుపులతో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఎండ వేడిమితో ఇబ్బందులు పడుతున్న ప్రజ లకు ఉపశమనం లభించింది.

భీంపూర్‌లో..

భీంపూర్: మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పిప్పల్కోటి గ్రామంలో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలు గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి ఇంటి పైకప్పులు ఎగిరి పడటంతో పాటు వృక్షాలు నేలకొరిగాయి. దీంతో జొన్న పంట పండించిన రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

జొన్నల కొనుగోళ్లు బంద్

నేరడిగొండ: అధిక నిల్వలు, వాతావరణంలో మార్పుల కారణంగా గురువారం జొన్నల కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పీఏసీఎస్ సెంటర్ ఇన్‌చార్జి బారే నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. 23 నుంచి కొనుగోలు చేస్తామని, 25 చివరి తేదీ అన్నారు.

సొత్నాల: మేడిగూడ మార్కెట్ యార్డులో జొన్నల నిల్వలు పెరిగిపోవడం, వాతావరణంలో మార్పు కారణంగా ఈనెల 22, 23 తేదీల్లో కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు పీఏసీఎస్ సెంటర్ ఇన్‌చార్జి వైద్యశాలిక్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

బోథ్: బోథ్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో కొనసాగుతున్న జొన్న కొనుగోళ్లను గురు, శుక్ర వారాల్లో తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కేంద్రం బాధ్యులు గోలి స్వామి తెలిపారు.

జొన్న రైతుల ఆందోళన


బేల: ఆందోళన చేస్తున్న రైతులు

బేల: మండలకేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో బుధవారం అకాల వర్షానికి తడిసిన జొన్నలు లారీ ల్లో తీసుకెళ్లాలని రైతులు ఆందోళన చేపట్టారు. బాధిత రైతులు మాట్లాడుతూ తాము తీసుకొచ్చిన జొన్నలకు మంగళవారమే తూకం పూర్తయిందని, షెడ్డు బయట ఉండడంతో అకాల వర్షంతో తడిశాయన్నారు. లారీల ఆలస్యంతో జొన్నలు తడిసినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై నాగనాథ్ జొన్నలను షెడ్డులోకి తరలించి, రైతులను సముదాయించడంతో ఆందోళన విరమించారు.

బజార్‌హత్నూర్: మండలంలో బుధవారం కురిసిన అకాల వర్షానికి జొన్న కొనుగోలు కేంద్రంలో కుప్పలుగా పోసిన జొన్న పంట తడవకుండా రైతులు టార్పాలిన్ కవర్లు కప్పారు. కానీ గాలితో టార్పాలిన్ కవర్లు లేవడంతో జొన్నలు తడిసిపోయాయి. తడిసిన జొన్నలను ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతుల అవస్థలు..

జైనథ్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జొన్న పంటను అమ్ముకునేందుకు వచ్చిన రైతులు అకాల వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మార్కెట్‌యార్డ్‌లో సరైన వసతులు లేకపోవడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి


నేరడిగొండ: ప్రజాభవన్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఆడే గజేందర్


కైలాస్‌నగర్: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: ఆధునిక సాంకేతికతకు మార్గదర్శి రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు దిగంబర్ రావు పాటిల్, భూపల్లి శ్రీధర్, లోక ప్రవీణ్ రెడ్డి, గుడిపల్లి నగేశ్, గిమ్మ సంతోష్, సుధాకర్‌గౌడ్, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రజాభవన్‌లో రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ మంత్రి సీతక్కతో కలిసి పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ 34 వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడారు. దేశ ప్రధానిగా రాజీవ్‌గాంధీ పేద ప్రజల సంక్షేమ కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన మహానాయకుడని కొనియాడారు. మండల పార్టీ అధ్యక్షుడు క్లౌం నారాయణ్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ జాలైజాకు, కార్యదర్శి చోలే ప్రభాకర్, ముస్తాఫా, అక్కెపెల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. రిమ్స్‌లోని బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆధునీకరణ, టెలికాం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అర్బాత్ ఖాన్, పరమేశ్వర్, ఆదిలాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు నాహిద్, ఉపాధ్యక్షుడు రూపేష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజ్, అశోక్, కిరణ్, అఖిల్, అంజద్, తౌసిక్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలి'

నార్నూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీని రద్దు చేసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అధికారులకు అప్పగించాలని బుధవారం ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈమేరకు ఎంపీడీవో గంగాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ లబ్ధిదారులుగా అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు. కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బీజేపీ మండలాధ్యక్షుడు భిక్షపతి రాథోడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చాల్కుర్ ప్రకాశ్, అమ్రపాలి జాడే, పాటిల్ భాగు, కొట్కార్ లక్ష్మిబాయి, దుర్గే గీతాంజలి, దుర్గే రోహిణి, జాడే పింకీ, మస్కే విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

ప్రధానచౌక్‌లలో ఫ్లెక్సీలు ఏర్పాటు


ఫ్లెక్సీ ఏర్పాటు చేయిస్తున్న టీపీఎస్ నవీన్ కుమార్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన చౌక్‌లల్లో చిరు, వీధి వ్యాపారుల షెడ్లు, తోపుడుబండ్లను తొలగించిన బల్దియా అధికారులు బుధవారం ఆయా ప్రాంతాల్లో హెచ్చరికతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆయా స్థలాల్లో ఎలాంటి వీధి వ్యాపారం చేయడానికి వీల్లేదని, కొనుగోలుదారులు గణేశ్ థియేటర్ స్థలంలో ఏర్పాటు చేసిన వ్యాపారుల వద్దకు వెళ్లి కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఎవరైనా అక్రమంగా వ్యాపారాలు చేసినా, షెడ్లు వేసినా అలాంటి వారిపై చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ పేరిట ఫ్లెక్సీల్లో తెలిపారు. టీపీఎస్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో బల్దియా సిబ్బంది ఆయా చౌక్‌లల్లో ఫ్లెక్సీలను ప్రదర్శించారు.

మల్టీపర్పస్ వర్కర్లకు యూనిఫాం అందజేత

బేల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం 8మంది మల్టీపర్పస్ వర్కర్లకు యూనిఫాంలను గ్రామ పంచాయతీ తరఫున మండల పంచాయతీ అధికా రి మహేశ్‌కుమార్ అందజేశారు. పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, కారోబారి కళ్యాణ్‌కార్ గజానన్ పాల్గొన్నారు.

గోతిరాం కిశోర్ త్యాగి అంత్యక్రియలు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని ఓ ఆశ్రమంలో ఉంటున్న గోతిరాం కిశోర్ త్యాగి బాబా మహరాజ్ మృతిచెందగా బుధవారం భక్తులు అంత్యక్రియలు నిర్వహించారు. గోతిరాం కిశోర్ త్యాగి బాబా మహరాజ్ బీహార్ రాష్ట్రం నుంచి వచ్చి గత కొంతకాలంగా సొనాల మండల కేంద్రంలోని ఋషి ఆశ్రమంలో ఉంటున్నాడు. వడగాల్పులతో తీవ్ర అస్వస్థతకు గురికాగా భక్తులు గమనించి రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.